## జనావాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును తరలించాలి



ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

● బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు పిట్టల అశోక్

బీబీనగర్, మార్చి 6 : జనావాసాల మధ్య చెత్తను, ఎయిమ్స్ బయో మెడికల్ వ్యర్థాలను పోసి డంపింగ్ యార్డుగా మార్చారని, వాటిని వెంటనే దూరంగా తరలించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిట్టల అశోక్ అన్నారు. బీఆర్ఎస్ బీబీనగర్ పట్టణ అధ్యక్షుడు గోలి సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పార్టీ కార్యకర్తలు డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. అనంతరం డంపింగ్ యార్డ్ తరలించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల అశోక్ మాట్లాడుతూ బీబీనగర్ పెద్ద చెరువు ఆవరణలో లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డ్‌ను ఎందుకు వినియోగంలోకి తీసుకొస్తలేరని అధికారులను ప్రశ్నించారు. నిర్దేశిత స్థలంలో కాకుండా అనుమతులు లేని పోచంపల్లి రోడ్డులో జనవాసాల మధ్య ఉన్న పీర్లగుట్ట వద్ద డంపింగ్ యార్డుగా మార్చడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, పొగతో లెప్రసీ కాలనీ వాసుల అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. వెంటనే ప్రస్తుతం వినియోగిస్తున్న డంపింగ్ యార్డును తరలించాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు గుంటిపల్లి లక్ష్మీనారాయణ, దేవరకొండ శ్రీనివాస్, పంజాల మహేశ్ గౌడ్, వంగరి పరాంకుశం, మహ్మద్ కుతుబుద్దీన్, పొట్ట శ్రీనివాస్, పంజాల ఈశ్వర్ గౌడ్, అశోక్ చారి, సున్నం రాజు, జాడ సంతోష్, రాంపల్లి కుమార్, బర్ల వెంకటేశ్, మర్రి శ్రీకాంత్, పొట్ట శ్రీనివాస్, రామ్, తదితరులు ఉన్నారు.

## 'కొలనుపాకలో హోమియోపతి వైద్యాధికారిని నియమించాలి'

మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి

ఆలేరురూరల్, మార్చి6 : మండలంలోని కొలనుపాక హోమియోపతి దవాఖానకు వెంటనే వైద్యాధికారిని నియమించాలని మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి కోరారు. కొలనుపాకలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ బదిలీలో భాగంగా ఇక్కడి వైద్యురాలు 7నెలల క్రితం హైదరాబాద్‌కు వెళ్లిపోగా ఇప్పటి వరకు వైద్యాధికారిని నియమించకపోవడంతో దవాఖాన మూతపడిందని తెలిపారు. హోమియోపతి మందులు వాడే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వైద్యాధికారిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నాయకులు జంగ స్వామి, బైరి కాలేందర్‌గౌడ్ తదితరులున్నారు.

## పెండింగ్ పాల బిల్లులు వెంటనే విడుదల చేయాలి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

రామన్నపేట, మార్చి6: మదర్ డెయిరీ, విజయ డెయిరీలో ఉన్న పెండింగ్ రూ.85కోట్ల పాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 11న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే మహా ధర్నా కార్యక్రమ పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగా ప్రత్యేక గ్రాడ్స్‌ను విడుదల చేసి పాల ఉత్పత్తి దారులను ఆదుకోవాలన్నారు. డెయిరీ సంస్థల ఆస్తులు అమ్ముకుండా, ప్రభుత్వ యంత్రాగం చొరవచూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గన్నెబోయిన విజయభాస్కర్, బోయిన ఆనంద్, నాయకులు పులి భిక్షం, బల్గూరి అంజయ్య, బావండ్లపల్లి బాలరాజు, గాదె నరేందర్, బండ జగన్‌మోహన్, మునుకుంట్ల లెనిన్, బూడిద భిక్షం, కొంగరి నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

## మహిళాభ్యున్నతితోనే సమూల మార్పులు

పోటీల్లో గెలుపొందిన బహుమతులతో మహిళలు

ఆలేరు టౌన్, మార్చి 6 : మహిళలందరూ సమైక్యంగా ఉన్నప్పుడే సమాజంలో సమూలమైన మార్పు తీసుకురావచ్చని, మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలని శ్రీరుద్రమదేవి మహిళా మాక్స్ సొసైటీ సీఈఓ పోగుల కవిత అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా ఆలేరు పట్టణ కేంద్రంలో రుద్రమదేవి మహిళా మాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు దేవర సుజాత, గడ్డం విజయ, సుజాత, చింతకింది ఉషాశ్రీ, కాశిరోజు మాధవి, దూడల లావణ్య, మిట్టపల్లి సంతోష, యమున, స్వాతి, సుకన్య, వివిధ గ్రామాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పద్మశాలీల మహాసభను విజయవంతం చేయండి

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 6 : హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 9న నిర్వహించే 17వ అఖిల భారత పద్మశాలీ సంఘం, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడక రమేశ్ కోరారు. పట్టణ కేంద్రంలోని పద్మశాలీ మహాజన సంఘం వద్ద గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీల హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు చిక్క వెంకటేశ్వర్లు, సీత శ్రీరాములు, భారత బాలరత్నం, భారత లవకుమార్, రాపోలు శ్రీనివాస్, బోగ నరసింహ, అంకం మురళి, అంకం పాండు, మెరుగు శశికళ, కర్నాటి అంజమ్మ, కుడికాల బలరాం, గుండు పాండు, గంజి అంజయ్య, ముసునూరు యాదగిరి, కటకం శ్యాంసుందర్, వేశాల మురళి, మంగళపల్లి రమేశ్, రుద్ర సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

## బాల్యమిత్రుల ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), మార్చి6 : మండలంలోని పల్లెర్లలో ఇటీవల చేనేత కార్మికుడైన గుర్రం లింగస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుటుంబానికి బాల్యమిత్రులు గురువారం రూ.11వేలతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. విఠల్ రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, అబ్దుల్ , రమేశ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

● కలెక్టర్ హనుమంతరావు

రాజాపేటలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

రాజాపేట, మార్చి 6 : వివిధ రోగాలతో దవాఖానకు వచ్చే రోగులకు డాక్టర్లు, సిబ్బంది మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. రాజాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్లు, సిబ్బంది విధులకు సమయానికి రావాలని ఆదేశించారు. అక్కడ ఉన్న పేషెంట్లను పలుకరిస్తూ వసతులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. కమలమ్మ అనే గర్భిణినిని రాజాపేట ఆసుపత్రి నుంచి జిల్లా ఆసుపత్రికి పంపిస్తే అక్కడ సిబ్బంది గుర్భిణిపై దురుసుగా ప్రవర్తించారని, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మండలంలోని బొందుగుల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా గ్రామంలోని పల్లె దవాఖానను సందర్శించి, హాజరు, ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ మానసపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

రాజాపేట : జాల గ్రామంలో నీళ్లు లేక ఎండిపోయిన వరి పైరులో కూర్చుని బాధ పడుతున్న రైతు ప్రభాకర్

## కౌలు రైతు కంట కన్నీరు

రాజాపేట, మార్చి 6 : వ్యవసాయమే జీవనాధారమైన కౌలు రైతు పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ఖర్చులతో పాటు యాజమాన్యం పెంచిన కౌలు ధరలతో అష్ట కష్టాలు పడి సాగు చేసిన కౌలు రైతుకు కన్నీళ్లే మిగిలాయి. రాజాపేట మండలంలోని జాల గ్రామానికి రైతు చెవిటి ప్రభాకర్‌కు సొంతంగా సాగు భూమి లేక పోవడంతో కుటుంబ జీవనోపాధి కోసం మండలంలోని కుర్రారం గ్రామానికి చెందిన పరెడ్డి గోపాల్‌రెడ్డి వద్ద మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరిసాగు చేశాడు. భూగర్భ జలాలు అడుగంటి పోయి ఉన్న మూడు బోర్లు వట్టి పోవడంతో అప్పు చేసి సాగు చేసిన వరి పొట్ట దశలో పంటంతా ఎండిపోయింది. చేసేదిలేక పశువుల మేతకు వదిలేశాడు. ప్రభుత్వ ఆదుకోవాలని రైతు వాపోయాడు.

## సాగునీటి సమస్యను పరిష్కరించాలి

మందళ్లగూడెంలో పిలాయిపల్లి కాల్వను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

చౌటుప్పల్ రూరల్, మార్చి6 : చౌటుప్పల్ మండలం మందళ్లగూడెం, సప్పిడోళ్లగూడెం, కుంట్లగూడెం గ్రామాల్లోని చెరువులను పిలాయిపల్లి కాల్వ ద్వారా నింపి సాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకుడు భూర్గు కృష్ణారెడ్డి కోరారు. చౌటుప్పల్ మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఆపార్టీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. పిలాయికాల్వ నిర్మాణం పూర్తి చేస్తే నాలుగు గ్రామాల పరిధిలో పదిహేను వందల ఎకరాలు సాగులోకి వస్తాయని తెలిపారు. ఆయన వెంట కొండె శ్రీశైలం, చెన్నబోయిన వెంకటేశం, సప్పిడి రాఘవరెడ్డి, తదితరులు ఉన్నారు.

## శ్రీవారి కల్యాణంలో సినీనటి అంజలి

మండలంలోని కనుముక్కుల గ్రామంలో పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం స్వామివారి కల్యాణం మహోత్సవం జరిగింది. సినీనటి అంజలి, సినీ నటుడు శ్రీనివాస్‌రెడ్డి వేడుకలకు హాజరయ్యారు. ఆలయ నిర్వాహకుడు, మాజీ జడ్పీటీసీ కోట పుష్పలతామల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కోట అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– భూదాన్‌పోచంపల్లి, మార్చి 6

## విద్యార్థులు కష్టపడి చదివి కలలను సాకారం చేసుకోవాలి



విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ బుక్‌లెట్‌ను అందజేస్తున్న ర్యాకల శ్రీనివాస్

●బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 6 : విద్యార్థులు కష్టపడి చదివి తమ కలలను సాకారం చేసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ సూచించారు. మండలంలోని అనంతారం గ్రామంలో గురువారం 10వ తరగతి విద్యార్థుల కోసం తన సొంత నిధులతో రూపొందించిన స్టూడెంట్ మిత్ర (కెరీర్ గైడెన్స్ బుక్ లెట్)ను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు రానున్న పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలని, తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని అన్నారు.

మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బుక్‌లెట్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.రంగరాజన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పి.లావణ్య, ఆర్ఎస్‌కే ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిరిపురం చేనేత సహకారం సంఘం అధ్యక్షుడిగా రామేశ్వరం

అధ్యక్ష, కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

రామన్నపేట, మార్చి6 : మండలంలోని సిరిపురం చేనేత సహకార సంఘం చైర్మన్‌గా అప్పం రామేశ్వరం గురువారం బాధ్యతలు స్వీకరించారు. చేనేత జౌళి శాఖ ఏడీ పద్మ ఉత్తర్వుల మేరకు సిరిపురంలోని సొసైటీలో డీఓఏ శ్రీనివాస్ రావు సంఘం చైర్మన్‌తోపాటు పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా అప్పం రామేశ్వరం, ఉపాధ్యక్షులుగా రాపోలు లక్ష్మమ్మ, జెల్ల లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ఏలె నర్సింహ, కార్యవర్గ సభ్యులుగా గుండు రాజు, రాపోలు పాపయ్య, రాపోలు రమేశ్, సంగిశెట్టి వెంకటమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చేనేత సంఘం నాయకులు, కార్మికులు పాలక వర్గాన్ని సన్మానించారు.

## నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ దవాఖానలకు షోకాజ్ నోటీసులు

యాదగిరిగుట్ట, మార్చి6 : నిబంధనలకు విరుద్ధంగా, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు-2010 ప్రకారం అతిక్రమణలు, ఉల్లంఘన పాల్పడుతూ యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల్లో నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్ తెలిపారు. ఈ నెల 5న జిల్లా ఉప వైద్యాధికారులు శిల్పిని, యశోదతోపాటు జిల్లా స్థాయి నోడల్ ఆఫీసర్లు దాడులు నిర్వహించి ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన విషయం విదితమే. ఈ తనిఖీల్లో యాదగిరిగుట్ట పట్టణంలో శ్రీసాయి ఆసుపత్రి, తుర్కపల్లిలోని ఆర్‌కే ఆసుపత్రి, నక్షత్ర ఆసుపత్రి, మాదాపూర్ గ్రామంలో శివ సాయి, సాయి జ్యోతి ఆసుపత్రులు నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించామన్నారు. షోకాజ్ నోటీసులకు మూడురోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో వివరణ సమర్పించినట్లయితే వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ఎల్ ఆర్ ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ

భూదాన్‌పోచంపల్లి, మార్చి 6 : 2020లో వెయ్యి రూపాయలు చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్ యజమానులు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తే అందులో 25 శాతం రాయితీ కల్పిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ అంజన్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు అనుమతి లేని లే అవుట్లో ప్లాట్‌లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్చి 31, 2025 వరకు రాయితీతో చెల్లించే అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. దీని కోసం శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## తాళం వేసిన ఇండ్లల్లో చోరీ

భువనగిరి అర్బన్, మార్చి 6 : పగలే తాళం వేసిన రెండు ఇండ్లలో చోరీ జరిగిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కలకొండ రాము, రాజు అన్నదనమ్ములు వేర్వేరు ఇండ్లలో పట్టణంలోని సీతానగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరి ఇండ్లు పక్కపక్కనే ఉంటాయి. గురువారం ఇండ్లకు తాళం వేసి పనుల నిమిత్తం వెళ్లారు. ఈ క్రమంలో సాయంత్రం నాలుగు గంటలకు స్కూల్ నుంచి పిల్లలు వచ్చే సమయానికి పనులకు వెళ్లిన వారు వచ్చి చూసే సరికి ఇండ్లకు వేసిన తాళాలు విరగొట్టి, ఇంట్లోని బీరువాలోని దుస్తులు, వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. పోలీసులకు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపడుతున్నారు.

## కారు ఢీకొని యువకుడి మృతి

బీబీనగర్, మార్చి 6 : బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పెరుమాండ్ల సూర్య ప్రసాద్ (24) బీబీనగర్ మండల కేంద్రం నుంచి గ్రామానికి బుధవారం అర్ధరాత్రి 11.40 గంటల సమయంలో బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యంలో హిందుస్తాన్ పరిశ్రమ ఆవరణలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొని తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు భానుచందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌ఓ ఎం.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

## మొక్కల పెంపకంపై శిక్షణ

మాట్లాడుతున్న ఎంపీడీఓ యాకూబ్‌నాయక్

రామన్నపేట, మార్చి6 : మండలంలోని జనంపల్లి గ్రామ నర్సరీలో గురువారం మండల పంచాయతీ కార్యదర్శులకు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వన సేవకులకు ఓరియంటేషన్ శిక్షణ నిర్వహించారు. నర్సరీలో నీరు పెట్టడం, కలుపుతీత, నారుమడి, ప్రైమరీ బెడ్ ఏర్పాటు, జీవామృతం తయారు చేసే అంశాలపై ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ ఆధ్వర్యంలో శిక్షణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజ్యానాయక్, బీట్ ఆఫీసర్ ప్రశాంతి, ఎంపీఓ రవూఫ్, ఏపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్‌కు అనుగుణంగా అభివృద్ధి పనులు జరుగాలి

● ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్, మార్చి 6 : వేసవి దృష్ట్యా ఎక్కడ కూడా తాగునీటి సమస్య రావద్దని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు జరుగాలని ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో గురువారం మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్, చండూర్ మున్సిపాలిటీలలో మౌలిక సదుపాయాల కల్పన, చేపడుతున్న అభివృద్ధి పనుల తీరుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు కొత్తగా నిర్మించిన నీటి ట్యాంకులు, పైపులైన్లు వాటి కనెక్టివిటీ, తాగునీటి వనరుల లభ్యతపై చర్చించారు. 2035 వరకు చౌటుప్పల్ మున్సిపాలిటీ జనాభా రెండు లక్షలకు పైగా పెరుగుతుందని, దానికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పట్టణంలో రోడ్లన్నీ 50, 80, 100 ఫీట్ల వెడల్పు ఉండేలా ప్రణాళికలు జరుగాలని తెలిపారు. పట్టణంలోని ఊర చెర్వు అలుగు ద్వారా వచ్చే నీటిని సర్వీస్ రోడ్డు కింద నుంచి బయటకు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. రెండు మున్సిపాలిటీలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా ఇంటిగ్రేటెడ్ ఆఫీసు భవనాలను నిర్మించుకోవాలని, ఇందుకు కావాల్సిన స్థలాలను గుర్తించాలని తెలిపారు. చండూర్‌లో మున్సిపాలిటీలో జరుగుతున్న డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల పనుల అభివృద్ధిపై ఆరాతీశారు. ఈ సమావేశంలో రెండు మున్సిపాలిటీలకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

●ఐద్వా జిల్లా కార్యదర్శి అనూరాధ

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనూరాధ

భూదాన్‌పోచంపల్లి, మార్చి 6 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనూరాధ అన్నారు. మండలంలోని పిల్లాయిపల్లిలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సులో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం మతోన్మాద విధానాలను వేగవంతం చేస్తున్నదని అన్నారు. పోరాడి సాధించుకున్న శ్రామిక మహిళ చట్టాలను రద్దుచేసి, పారిశ్రామిక లాభాల కోసం కోడ్‌లు తెచ్చిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లలపై అత్యాచారాలు, హింసలు బాగా పెరిగాయని, మహిళలకు సమాన పనికి సమాన వేతనం, హింసను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు అందెల జ్యోతి, నాయకురాలు పగిల లావణ్య, బంధారపు నిర్మల, అబ్బావతి లక్ష్మి, పన్నీరు విజయ, కందాడి రాములమ్మ, బందెల జయమ్మ, బందారపు సమంత, కొంత నిర్మల, నడికుడి మంజుల, అందెల బాలమని పాల్గొన్నారు.

## గ్రంథాలయం సెస్ వసూలుకు కృషి చేయాలి

● జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ

మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ

భువనగిరి అర్బన్, మార్చి 6 : గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయానికి వచ్చే సెస్ వసూలుకు అధికారులు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ అన్నారు. పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో గురువారం ఆ సంస్థ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. త్వరలో మోత్కూర్, బొమ్మలరామారం శాఖ గ్రంథాలయాలకు నూతన ఫర్నిచర్ కొనుగోలు చేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెడతామని చెప్పారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.సుధీర్, వివిధ మండలాల గ్రంథ పాలకులు, పార్ట్‌టైం వర్కర్స్, పార్ట్ టైం స్వీపర్స్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

● మండల స్పెషల్ ఆఫీసర్ రమణి

సమావేశంలో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ రమణి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 6 : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రమణి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో మంచినీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని, నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్, ఎంపీఓ మజీద్, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దీన్‌దయాళ్, ఏఈ సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వపరిపాలన దినోత్సవం

స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఆలేరు రూరల్, మార్చి6 : మండలంలోని కొలనుపాక ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విద్యార్థులు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## వాట్సాప్‌లో ఆవుల బేరం.. పాడి రైతుకు రూ.85 వేలు టోకరా

భువనగిరి కలెక్టరేట్, మార్చి 6 : ఆన్‌లైన్ మోసానికి గురై పాడి రైతు రూ. 85,300 పోగొట్టుకున్న సంఘటన మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పాడి రైతుకు వాట్సాప్ ద్వారా గుర్తు తెలియని నంబర్ నుంచి బుధవారం పలు పాడి ఆవులకు సంబంధించిన ఫొటోలు వచ్చాయి. ఈ క్రమంలో పాడిరైతుకు అమ్మడానికి గుర్తు తెలియని వ్యక్తి నచ్చిన పాడి ఆవులను ఎంపిక చేసుకోవాలని సూచించగా బాధిత పాడి రైతు వాట్సాప్‌లో ఉన్న మూడు పాడి ఆవులను ఎంపిక చేసుకున్నాడు. ఎంపిక చేసుకున్న మూడు పాడి ఆవులకు గానూ రూ. లక్షా అయిదు వేలు అవుతాయని, డబ్బులను ఫోన్ పే ద్వారా పంపించాలని కోరగా బాధిత రైతు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ పేకు రూ. 85,300 పంపించాడు. మి